సాక్షి
కామారెడ్డి

శనివారం । 6 । ఏప్రిల్ । 2024

I



ధాన్యం కొనుగోళ్లెప్పుడో?

నెలారంభంలోనే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని అధికారులు చెప్పినా.. చాలాచోట్ల కొనుగోళ్లు మొదలవలేదు.

- IIIలో ▸



గరిష్ఠం/కనిష్ఠం
42.9 /23.7

వాతావరణం

ఉదయం నుంచే ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

త్రిపుర గవర్నర్‌ను కలిసిన బీజేపీ నేతలు



కామారెడ్డి టౌన్: త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని శుక్రవారం జిల్లాకు చెందిన పలువురు బీజేపీ నేతలు కలిశారు. త్రిపుర వెళ్లిన బీజేపీ నేతలు అగర్తలలోని రాజ్‌భవన్‌కు వెళ్లి ఇంద్రసేనారెడ్డిని కలిసి, సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ ప్రత్యేక ఆహ్వాన ప్రతినిధి రంజిత్‌మోహన్, జిల్లా నాయకుడు శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

అర్చకులతో సమావేశం



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన అర్చకులతో దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ శుక్రవారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆలయాల్లో సమస్యలను తెలుసుకున్నారు. ఉగాది, శ్రీరామనవమి, హనుమాన్ జయంతి ఉత్సవాల నిర్వాహణపై చర్చించారు. దేవాదాయ శాఖ పరిశీలకులు బి కమల తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు




డిచ్‌పల్లి: ఎండలు పెరిగిన దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి సమస్య రాకుండా పంచాయతీ ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని డీపీవో తరుణ్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని బర్దిపూర్ గ్రామాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. గ్రామంలోని నీటి ట్యాంకులను పరిశీలించారు. 10 రోజులకు ఒకసారి ట్యాంకులను శుభ్రం చేయాలని సూచించారు. అనంతరం గ్రామ నర్సరీని సందర్శించి మొక్కలను పరిశీలించారు. పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శి వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డుకు వరుస సెలవులు

సుభాష్‌నగర్: నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఉగాది, రంజాన్ పండుగలు పురస్కరించుకుని ఏప్రిల్ 8 నుంచి 11 వరకు సెలవులు ప్రకటించినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ వెంకటేశం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మర్చంట్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు 8న అమావాస్య, 9న ఉగాది, 11న రంజాన్ సందర్భంగా యార్డు బంద్ ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. 6న శనివారం, 7న ఆదివారం సహా మొత్తం ఆరు రోజులు పసుపు క్రయవిక్రయాలు జరగవన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు. ఏప్రిల్ 12 నుంచి మార్కెట్‌లో వ్యాపార కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు.

ఇందూరులోనే పసుపు బోర్డు



సుభాష్‌నగర్(నిజామాబాద్ అర్బన్): జిల్లాలోనే పసుపు బోర్డు ఏర్పాటవుతుందని ఎంపీ ధర్మపురి అర్వింద్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బోర్డు ఏర్పాటైనట్లు గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిందని, ఇందూరులోనే కార్యాలయం ఏర్పాటు చేస్తారన్నారు. శుక్రవారం నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు సమస్యలపై నిర్వహించిన సత్యాగ్రహ దీక్షలో ఆయన మాట్లాడారు. దేశ ప్రజలు నరేంద్ర మోదీని గ్యారంటీగా నమ్ముతున్నారని, అబద్ధాలు, మోసాలు చేస్తున్న కాంగ్రెస్‌ను విశ్వసించడం లేదన్నారు. దేశంలో నాలుగేళ్లలో 66 చక్కెర ఫ్యాక్టరీలకు నిధులు వెచ్చించి, సబ్సిడీలు ఇచ్చి తెరిపించిన ఘనత మోదీదన్నారు. చక్కెర ఫ్యాక్టరీలు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వల్లే మూతపడ్డాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోకుంటే నిజాం షుగర్స్ ఫ్యాక్టరీలను తెరిపించే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో గ్యారంటీలు అమల్జేయని కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. రాష్ట్రంలో 12 ఎంపీ సీట్లు బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

● దోమకొండ మండల కేంద్రానికి చెందిన నేతుల శ్రీనివాస్.. యాసంగిలో వరి సాగు చేశాడు. భూగర్భ జలాలు అడుగంటడంతో బోరు ఎత్తిపోయింది. దీంతో చేతికందే దశలో పంట ఎండిపోయింది. పంట ఎండిపోవడంతో పెట్టుబడులు నష్టపోయానని రైతు శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



దోమకొండలో ఎండిపోయిన వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

● బిచ్కుంద మండలం ఫత్లాపూర్‌లో గంగాధర్ అనే రైతు రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి పంట వేశాడు. ఇటీవల బోరులో నీరు అడుగంటిపోయింది. దీంతో పంట ఎండిపోతుండడంతో మేకలను మేపుతున్నాడు. చేసిన కష్టంతోపాటు పెట్టిన పెట్టుబడి వృథా అయ్యిందని, అప్పులే మిగిలాయని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.



ఫత్లాపూర్‌లో బోరు ఎత్తిపోవడంతో ఎండిన పొలంలో మేకలను వదిలిన దృశ్యం

● తాడ్వాయి శివారులో లక్ష్మణ్‌రావు అనే రైతు మక్కతోపాటు కూరగాయలు సాగు చేస్తున్నాడు. మూడు వారాల క్రితం కురిసిన వడగళ్ల వానతో విద్యుత్ స్తంభాలు విరిగిపడి కరెంటు సరఫరా నిలిచిపోయింది. ఇప్పటికీ పునరుద్ధరించకపోవడంతో నీరందక పంటలు ఎండిపోయాయి. దీంతో చేసేదేమీ లేక పొలంలో పశువులను మేపుతున్నాడు.



తాడ్వాయి శివారులో కూరగాయల పంటలో పశువులను మేపుతున్న రైతు

కదిలిస్తే కన్నీళ్లే!



లింగంపేట మండలం లింగంపల్లి శివారులో ఎండిపోయిన వరి

యాసంగిపై రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. ఇటీవల కురిసిన వడగళ్ల వానతో ఇరవై వేలకుపైగా ఎకరాలలో పంటలు దెబ్బతినగా.. భూగర్భ జలాలు అడుగంటి బోర్లు ఎత్తిపోతుండడంతో వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి. పంటలను కాపాడుకోవడానికి భగీరథ ప్రయత్నాలు చేస్తున్నా ఫలించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదుకోవాలని సర్కారును కోరుతున్నారు.

– సాక్షి, కామారెడ్డి



బీబీపేటలో ఎండిపోతున్న వరి పంట

- పాతాళానికి పడిపోయిన భూగర్భ జలాలు
- బోర్లు ఎత్తిపోయి దెబ్బతింటున్న పంటలు
- పెట్టుబడులు కోల్పోతున్న రైతులు
- ఆదుకోవాలని వేడుకోలు



రామారెడ్డి మండలం ఇసన్నపల్లిలో మల్లయ్య అనే రైతు బోరు ఎత్తిపోయి ఎండిన పంట

యాసంగి సీజన్‌లో జిల్లాలో 3.80 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ప్రధానంగా 2.31 లక్షల ఎకరాల్లో వరి సాగవగా.. 36,584 ఎకరాల్లో జొన్న, 37,971 ఎకరాల్లో మక్క, 58,505 ఎకరాల్లో శనగ వేశారు. జిల్లాలో ఎక్కువగా బోరుబావులపై ఆధారపడి పంటలు సాగు చేస్తారు. ఎండల తీవ్రత పెరుగుతుండడంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. జిల్లాలో డిసెంబరులో 9.3 మీటర్ల లోతులో ఉన్న భూగర్భ జలాలు.. ఫిబ్రవరిలో 12.92 మీటర్ల లోతుకు తగ్గాయి. మార్చి నెలాఖరు నాటికి 14.47 మీటర్ల లోతుకు పడిపోయాయి. మూడు నెలల కాలంలో దాదాపు ఐదు మీటర్ల మేర భూగర్భ జలాలు పడిపోయాయని జిల్లా భూగర్భజల శాఖ అధికారి సతీశ్ యాదవ్ 'సాక్షి'తో పేర్కొన్నారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆయన సూచిస్తున్నారు.

ఎత్తిపోతున్న బోర్లు..

జిల్లాలో లక్ష పైచిలుకు బోరుబావులు ఉన్నాయి. ఎండల తీవ్రత పెరుగుతుండడంతో బోర్లు ఎత్తిపోతున్నాయి. ఏ ఊరికి వెళ్లినా రైతులు పంట ఎండిపోతున్న విషయమే చెబుతున్నారు. బోర్లలో నీరు తగ్గిపోవడంతో కొందరు రైతులు అప్పులు చేసి కొత్తగా బోర్లు తవ్వించే ప్రయత్నం చేస్తున్నా.. నీరు పడడం లేదు. దీంతో పంటను కాపాడే ప్రయత్నంలో మరింత అప్పుల పాలవుతున్నారు. కొందరు రైతులు చేతికందే సమయంలో ఎండుతున్న పంటను కాపాడుకునేందుకు ట్యాంకర్లతో కూడా నీరు పారించే ప్రయత్నం చేస్తున్నా.. మండుతున్న ఎండలతో ఆ ప్రయత్నాలన్నీ వృథా అవుతున్నాయి.

ఆందోళన బాట

అకాల వర్షాలతోపాటు ఎండలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. ఈ డిమాండ్‌తో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. శనివారం నియోజకవర్గ కేంద్రాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టనున్నారు.

దెబ్బమీద దెబ్బ

ఇటీవల ఈదురు గాలులు, వడగళ్ల వానతో 20 వేలకుపైగా ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఆ దెబ్బ నుంచి కోలుకోకముందే బోర్లు ఎత్తిపోయి పంటలు దెబ్బతింటుండడంతో రైతులు కంటతడి పెడుతున్నారు. పెట్టుబడుల కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం కానరావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పెట్టుబడి మీద పడింది



రెండెకరాలలో వరి వేసిన. పెట్టుబడికి రూ.20 వేలపైనే ఖర్చయ్యింది. బోరు ఎత్తిపోవడంతో చేతికందిన పంట నాశనం అయ్యింది. రెక్కల కష్టం పోయింది. పెట్టుబడి మీద పడింది. సర్కారు ఆదుకోవాలి.

– దత్తు, రైతు, దౌల్తాపూర్

పంట ఎండిపోయింది



బోరు మీద ఆధారపడి యాసంగిలో రెండెకరాల్లో వరి పంట వేసిన. పంట మంచిగుందని సంబురపడినం. ఇంతలోనే బోరు ఎత్తిపోయింది. లాభం లేదనుకుని పంటను వదిలేసిన. ఈసారి లాగోడి మొత్తం మునిగినం.

– పీరాబోయి, రైతు, సుల్తాన్‌పేట్

కరంటు లేక..



ఇరవై రోజుల కింద ఈదురు గాలులతో రాళ్ల వాన కురిసింది. దీంతో స్తంభాలు ఇరిగిపోయి కరంటు బందయ్యింది. అప్పటినుంచి కరంటు లేదు. నీరందక మక్కతో పాటు కూరగాయల పంటలు ఎండిపోతున్నాయి.

– లక్ష్మణ్‌రావు, రైతు, తాడ్వాయి

పదిహేనేళ్లలో మొదటిసారి..



ఎకరం ముప్పై గుంటలలో వరి వేశాను. రూ.డెబ్బై వేల దాకా పెట్టుబడి అయ్యింది. బోరులో నీరు అడుగంటి పంట ఎండిపోయింది. పదిహేనేళ్లలో మొదటిసారి పంట ఎండిపోవడంతో నష్టపోవాల్సి వచ్చింది.

– సుభాష్‌గౌడ్, రైతు, లింగంపేట

రెండు బోర్లు ఎత్తిపోయినయి



నాలుగు ఎకరాల్లో వరి వేసిన. మొన్న పడ్డ రాళ్ల వానతో ఎకరం వరి నాశనం అయ్యింది. రెండు బోర్లు ఎత్తిపోవడంతో మిగిలిన మూడెకరాల పంట ఎండిపోయింది. వ్యవసాయంతో నష్టమే మిగులుతోంది.

– ర్యావ సాయిలు, రైతు, పొందుర్తి

మండే ఎండ... అప్రమత్తతే అండ!



- రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- జాగ్రత్తలు అవసరమంటున్న వైద్యులు

సాక్షి, కామారెడ్డి: భానుడు భగభగ మండుతున్నాడు. వారం రోజులుగా జిల్లావ్యాప్తంగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. చాలాచోట్ల 42 డిగ్రీలు దాటాయి. పొద్దున తొమ్మిది గంటలకే సూర్యుడి ప్రతాపం మొదలవుతోంది. మధ్యాహ్నం పూట బయటకు వెళ్లాలంటేనే జంకే పరిస్థితులు ఉన్నాయి. వడగాలులు కూడా ఇబ్బంది పెడుతున్నాయి. వేసవి కాలంలో చిన్నారుల్లో సహజంగానే అనారోగ్య సమస్యలు వస్తుంటాయి. పిల్లలు చాలా మంది చర్మ, శ్వాస సంబంధ వ్యాధులు, జ్వరాల బారిన పడుతుంటారు. డయేరియా, వాంతులు, శ్వాస సంబంధ సమస్యలు, చర్మ సమస్యలు, వైరల్ ఫీవర్స్, టైఫాయిడ్, చికెన్ ఫాక్స్, పసరికలు తదితర వ్యాధుల ప్రమాదం పొంచి ఉంటుంది. అలాగే ముఖ్యంగా పిల్లలు ఎక్కువ సేపు ఆటల్లో మునిగిపోతుంటారు. చెమటతో శరీరంలోని నీరు బయటకు వెళ్లడం ద్వారా డీ హైడ్రేషన్‌కు గురై నీరసించిపోయే అవకాశాలుంటాయి. పిల్లలు తినే ఆహారం, తాగే నీటి విషయంలోనూ తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉంది. ఎండలు చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశ ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

జిల్లా అంతటా దంచికొట్టిన ఎండలు

జిల్లాలో ఎండలు మండుతున్నాయి. రోజురోజుకు పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో జనం అల్లాడుతున్నారు. శుక్రవారం జిల్లాలో అత్యధికంగా పల్వంచ మండలం ఎల్పుగొండలో 42.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. దాదాపు జిల్లా అంతటా ఎండల తీవ్రత ఎక్కువగానే ఉంది. బాన్సువాడ మండలం మొగులాన్‌పల్లిలో ఒకరు వడదెబ్బతో ఆస్పత్రి పాలై చికిత్స పొందుతూ మరణించాడు. ఎండలకు తోడు వడగాలులు వీస్తుండడంతో జనం ఇబ్బంది పడుతున్నారు. వ్యవసాయ పనులు, ఉపాధి హామీ పనులకు వెళ్తున్న వారు నీరసించిపోతున్నారు.

పిల్లల విషయంలో జాగ్రత్త..



పిల్లల ఆరోగ్యం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. తినే ఆహారం నుంచి తాగే నీళ్ల దాకా జాగ్రత్త పడాలి. ఆరు నెలలలోపు పిల్లలకు తల్లిపాలే పట్టాలి. ఏడాదిలోపువారికి పాలతో పాటు పరిశుభ్రమైన నీటిని ఇవ్వాలి. ఏడాది నుంచి ఐదేళ్లలోపు పిల్లలు ఎండలో తిరగకుండా చూడాలి. ఎండ వేడి, వడగాలి తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. లూజుగా ఉండే కాటన్ దుస్తులు వేయాలి. ఎండాకాలంలో స్పైసీ ఫుడ్ ఇవ్వకపోవడమే ఉత్తమం.

– కె.నరేందర్‌రావు, పిల్లల వైద్య నిపుణులు, కామారెడ్డి

జిల్లాలో శుక్రవారం నమోదైన ఉష్ణోగ్రతలు (డిగ్రీలలో..)

						సర్వాపూర్	41.0
						మాచాపూర్	40.8
ఎల్పుగొండ	42.9	పాతరాజంపేట	42.6	డోంగ్లీ	41.5	నస్రుల్లాబాద్	40.7
హసన్‌పల్లి	42.7	రామారెడ్డి	42.3	బీర్కూర్	41.4	జుక్కల్	40.7
దోమకొండ	42.6	బిచ్కుంద	42.0	బొమ్మన్‌దేవ్‌పల్లి	41.4	పెద్దకొడప్‌గల్	40.5
గాంధారి	42.6	తాడ్వాయి	41.9	మక్దుంపూర్	41.4	మేనూర్	40.3
భిక్కనూరు	42.5	పిట్లం	41.8	లింగంపేట	41.0	సోమూర్	40.0

ఘనంగా జగ్జీవన్ రాం జయంతి



జగ్జీవన్ రాం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అధికారులు

కామారెడ్డి క్రైం: అణగారిన వర్గాల అభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు బాబూ జగ్జీవన్ రాం అని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో బాబూ జగ్జీవన్ రాం జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగ్జీవన్ రాం దేశంలో సామాజిక న్యాయం కోసం కృషి చేశారని కొనియాడారు. ప్రతి ఒక్కరూ ఆయన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఎస్సీ అభివృద్ధి అధికారి రజిత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, డీఎస్‌వో మల్లికార్జున బాబు, నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, అధికారులు వెంకట్‌రెడ్డి, దేవేందర్, నాగరాజు, కిష్టయ్య, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుణ్య స్నానాలకు వెళ్తూ మృత్యు ఒడికి..

- డివైడర్ మధ్యలోని పూలు తెంపుకుని వస్తుండగా ప్రమాదం
- ఐదు నెలల గర్భిణి మృతి



మృతదేహాన్ని ఆటోలో తరలిస్తున్న ఎస్సై తదితరులు

బాల్కొండ: సంప్రదాయం ప్రకారం గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించడానికి వెళ్తున్న ఐదు నెలల గర్భిణి.. మార్గమధ్యలో డివైడర్‌పై ఉన్న పూలను తెంపి, వాహనం వద్దకు వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడింది. వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్‌కు చెందిన కొమిరె మాధవి(25) ఐదు నెలల గర్భిణి. ఐదు నెలల సమయంలో గంగమ్మ పూజలు చేయడం వారి కుటుంబంలో ఆనవాయితీ. దీంతో శుక్రవారం ఉదయం మాధవి భర్త గంగసాగర్, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి నిర్మల్ జిల్లా సోన్ వద్ద గల గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించడానికి ఆటోలో బయలుదేరారు. మార్గమధ్యలో మెండోరా మండలం బుస్సాపూర్ వద్ద ఆటోను ఆపి జాతీయ రహదారిపై డివైడర్ మధ్యలోనున్న పూలను తెంపడానికి మాధవి వెళ్లింది. పూలను తెంపి తిరిగి వస్తుండగా వేగంగా వచ్చిన వాహనం ఆమెను ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మరణించింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని మెండోరా ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

రైతులను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

- బీజేపీతోనే అన్నదాతలకు భరోసా
- రైతు సత్యాగ్రహ దీక్షలో ఎమ్మెల్యే కేవీఆర్



దీక్షలో పాల్గొన్న ఎమ్మెల్యే కేవీఆర్, ఎంపీ బీబీపాటిల్, నాయకులు

కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో కాంగ్రెస్ సారథ్యంలోని ప్రభుత్వం రైతుల గోసను పట్టించుకోవడం లేదని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆరోపించారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద బీజేపీ ఆధ్వర్యంలో రైతు సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల కురిసిన వడగళ్ల వానతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో సర్కారు విఫలమైందని ఆరోపించారు. క్షేత్ర స్థాయిలో అధికారులు సైతం పంటల నష్టాన్ని సరిగ్గా సర్వే చేయలేదన్నారు. ఒక్క కామారెడ్డి నియోజకవర్గంలోనే 14 వేల ఎకరాలలో పంటలు దెబ్బతిన్నాయని, కానీ జిల్లావ్యాప్తంగా 14 వేల ఎకరాల్లోనే పంట నష్టం జరిగినట్లు అధికారులు లెక్కలు చూపారని పేర్కొన్నారు. రూ. 2 లక్షల పంట రుణ మాఫీ, వరికి క్వింటాలుకు రూ. 500 బోనస్ తదితర హామీల అమలు ఏమయ్యిందని ప్రశ్నించారు. ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ. 25 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. పంట నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఎంపీ బీబీ పాటిల్ డిమాండ్ చేశారు. దీక్షలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార, రాష్ట్ర ఉపాధ్యక్షులు యెండల లక్ష్మీనారాయణ, మోర్చాల జిల్లా అధ్యక్షులు లక్ష్మారెడ్డి, వేణు, అనిత, బాలరాజు, నాయకులు బాణాల లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, నరేందర్‌రెడ్డి, రవీందర్‌రావు, లక్ష్మారెడ్డి, లింగారావు, భరత్, శ్రీనివాస్, నరేందర్ పాల్గొన్నారు.

సన్‌ఫ్లవర్ కాంటా బంద్

- జిల్లాలో దిగుబడి సుమారు 21వేల క్వింటాళ్లు
- 7వేల క్వింటాళ్ల కొనుగోలుకే నాఫెడ్ అనుమతి
- ఐదు సొసైటీల పరిధిలో కొనుగోళ్లు
- మార్కెట్‌లో ధర లేక రైతుల్లో ఆందోళన

ప్రతికూల వాతావరణాన్ని అధిగమించి సన్‌ఫ్లవర్ సాగు చేసిన రైతులు పంట దిగుబడిని విక్రయించే దశలో కష్టాలపాలవుతున్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా సన్‌ఫ్లవర్ సేకరణను నిలిపివేయడం, బహిరంగ మార్కెట్‌లో ధర లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.


సాలూర సొసైటీ కొనుగోలు కేంద్రం ఆవరణలో సన్‌ఫ్లవర్ కుప్పలు

బోధన్: జిల్లాలో పొద్దు తిరుగుడు పంట 2,300 ఎకరాల విస్తీర్ణంలో సాగయ్యిందని అధికారులు అంచనా వేయగా, 3వేల ఎకరాల వరకు సాగైందని రైతు ప్రతినిధులు అంటున్నారు. పంటసాగు విస్తీర్ణం అధికారిక లెక్కల ప్రకారం చూసినా 16,100 క్వింటాళ్ల దిగుబడి ఉంటుంది. అయితే, నాఫెడ్ (నేషనల్ అగ్రికల్చర్ కో–ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్) కేవలం 7వేల క్వింటాళ్ల సేకరణకు మాత్రమే అనుమతించింది. నిర్దేశిత లక్ష్యం మేరకు ఐదు సొసైటీల ఆధ్వర్యంలో సన్ ఫ్లవర్ దిగుబడిని సేకరించి కాంటాలను బంద్ చేశారు. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. బహిరంగ మార్కెట్‌లో విక్రయిద్దామనుకుంటే ధర రూ.4,500కు మించి పలకడం లేదని, కొనుగోలు దారులు ఆసక్తి చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మార్క్‌ఫెడ్ ద్వారా జిల్లాలోని బోధన్ రెవెన్యూ డివిజన్ పరిధిలో సాలూర, బోధన్, హున్సా, కల్దుర్కి, పాతంగల్ సొసైటీల్లో మార్చి నెలాఖరులో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని నాఫెడ్ జిల్లాలో 7 వేల క్వింటాళ్ల సన్‌ఫ్లవర్ పంట దిగుబడి కొనుగోలు చేసేందుకు మార్క్‌ఫెడ్‌కు అనుమతించింది. ఈ మేరకు మార్క్‌ఫెడ్ ఆయా సొసైటీలకు పంట కొనుగోలు పరిమితి విధించి కోటాను కేటాయించింది. లక్ష్యం మేరకు కొనుగోళ్లను పూర్తి చేసి సొసైటీల్లో కాంటాను నిలిపివేశారు. సాలూర సొసైటీకి వెయ్యి క్వింటాళ్ల కోటా ఇవ్వగా.. వెనువెంటనే తూకం వేసి కొనుగోలు ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సొసైటీ పరిధిలో మరో వెయ్యి క్వింటాళ్లకు పైగా పంట దిగుబడి అలాగే ఉండిపోయింది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన అన్నిచోట్ల ఇదే పరిస్థితి ఉంది. కొనుగోలు కేంద్రాల ఆవరణలో పంటదిగుబడి కుప్పలు పోసిన రైతులు ఎండలో పడిగాపులు కాస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కొనుగోళ్లకు అనుమతి రావాల్సి ఉందని మార్క్‌ఫెడ్ అధికారులంటున్నారు. ఈ నిర్ణయం రాష్ట్ర స్థాయిలో జరగాల్సి ఉందని స్పష్టమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు అనుమతిస్తుందో తెలియని పరిస్థితి ఉంది. ఆలస్యం చేయకుండా వెంటనే సన్‌ఫ్లవర్ కొనుగోళ్లకు అనుమతి ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ఇటీవల నిర్వహించిన సొసైటీ మహాజన సభల్లోనూ ప్రభుత్వం వెంటనే కొనుగోళ్లను ప్రారంభించాలని తీర్మానాలు చేశారు. సన్‌ఫ్లవర్ కొనుగోళ్లు ఎప్పుడు పునఃప్రారంభమవుతాయో తెలియని పరిస్థితి ఉంది. ఈ విషయంలో సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు.

అనుమతి రావాల్సిఉంది

రైతుల వద్ద ఉన్న సన్‌ఫ్లవర్ కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి రావాల్సి ఉంది. జిల్లాలో ఐదు కొనుగోలు కేంద్రాల ద్వారా 700 మెట్రిక్ టన్నుల పంటను సేకరించాం. మరో 300 నుంచి 400 మెట్రిక్ టన్నుల వరకు రైతుల వద్ద పంట నిల్వలున్నాయని అంచనా. త్వరలోనే అనుమతి వస్తుంది.

– రంజిత్ రెడ్డి, డీఎం, మార్క్‌ఫెడ్, నిజామాబాద్

22 ఎకరాల్లో సాగు చేశా



మేము 22 ఎకరాల్లో సన్‌ఫ్లవర్ సాగు చేశాం. 15 రోజుల క్రితమే పంట కోత, నూర్పిడి పూర్తి చేశాం. సొసైటీ కొనుగోలు కేంద్రంలో కొనుగోలు నిలిపివేశారు. గ్రామ రైతువేదిక ఆవరణలో ఆరబెట్టి కుప్పలు పోసి ఉంచాం. మార్కెట్లో పంటను కొనేవారు లేరు. నాలాగే చాలా మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే ప్రభుత్వం కొనుగోళ్లను ప్రారంభించి ఆదుకోవాలి.

– లక్ష్మాగౌడ్, సన్‌ఫ్లవర్ రైతు, హున్సా

క్లుప్తంగా

స్పాట్‌కు హాజరైన టీచర్లు

నిజామాబాద్‌అర్బన్: పదో తరగతి ప్రశ్నాపత్రాల మూల్యాంకనానికి గైర్హాజరైన 195 మంది టీచర్లకు డీఈవో దుర్గాప్రసాద్ నోటీసులు జారీ చేయగా, శుక్రవారం 123 మంది హాజరయ్యారు. అనారోగ్య కారణాలను పేర్కొంటూ మిగతా వారు రిపోర్టు చేయగా, వారికి స్పాట్ వాల్యుయేషన్ విధుల నుంచి మినహాయింపు కల్పించారు.

నేడు ఎన్నికల శిక్షణ

స్పాట్ వాల్యుయేషన్ విధులకు హాజరవుతున్న టీచర్లకు ఎన్నికలకు సంబంధించిన శిక్షణను శనివారం ఇవ్వనున్నారు. అలాగే ఫామ్–12ను అందించనున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ కొనసాగుతున్నదని డీఈవో తెలిపారు.

ఇంటి వద్దకే కల్యాణ తలంబ్రాలు



ఖలీల్‌వాడి: శ్రీరామ నవమిని పురస్కరించుకొని భద్రాద్రి సీతారామచంద్రస్వామి కల్యాణ తలంబ్రాలను ఆర్టీసీ ద్వారా అందుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానీరెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం పోస్టర్లను ఆవిష్కరించారు. నిర్ణీత రుసుము చెల్లిస్తే ఇంటి వద్దకే ఆర్టీసీ స్వామివారి కల్యాణ తలంబ్రాలను చేరుస్తుందని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రుద్రూర్ వాసుల 'నోవా వరల్డ్ రికార్డ్'



రుద్రూర్: రథసప్తమి సందర్భంగా ఇండియన్ యోగా అసోసియేషన్ యోగాలయ హెల్త్ కేర్ ఇన్‌స్టిట్యూట్ (తమిళనాడు) ఆధ్వర్యంలో నిర్వహించిన సూర్యనమస్కార సాధనలో రుద్రూర్‌కు చెందిన తండ్రి, కూతురు, కుమారుడు పాల్గొని రికార్డ్ సాధించారు. రుద్రూర్‌కు చెందిన మహాజన్ విశ్వనాథంతోపాటు ఆయన కూతురు అక్షయశ్రీ, కుమారుడు అద్వైత్ తెలంగాణ నుంచి పాల్గొన్నారు. యోగా గురువు బాబారామ్‌దేవ్‌తో కలిసి సూర్యనమస్కారాలు చేసి నోవా వరల్డ్ రికార్డ్ సాధించి ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని నర్సింగ్‌పల్లిలో ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రం వేంకటేశ్వర స్వామి దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఏడురోజులు అంగరంగ వైభవంగా కొనసాగిన బ్రహ్మోత్సవాలు మూలవిరాట్‌కు ఉత్సవానంతర స్నపన సేవతో ముగిశాయి. యజ్ఞాచార్యులు, అర్చక స్వాములు, వేద పండితులు 108 కళశాల్లో అభిషేక గంగను తీసుకొచ్చి స్వామివారికి అభిషేకం చేశారు. గ్రామస్తుల సహకారం మరువలేనిదని ధర్మకర్త నరసింహారెడ్డి అన్నారు. భవిష్యత్‌లో మరింత ఘనంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఆలయ ధర్మకర్తలు నర్సింహారెడ్డి, విజయసింహారెడ్డి, సుదర్శన్‌రెడ్డి దంపతులతోపాటు ఎంపీటీసీ రాములు, ఫొటో గంగాధర్, రవీందర్‌యాదవ్, నర్సారెడ్డి, నరాల సుధాకర్, ప్రసాద్, యాజ్ఞాచార్యులు సత్యన్నారాయణాచార్యులు, రోహిత్ కుమారాచార్యులు, శ్రీకర్ కుమారాచార్యులు, విజయ్ స్వామి, భక్తులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య


చెట్కూరి రాజలింగం (ఫైల్)

తాడ్వాయి(ఎల్లారెడ్డి): భార్య సంసారానికి రావడం లేదని మండల కేంద్రానికి చెందిన చెట్కూరి రాజలింగం(38) బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. లింగం తన భార్య నర్సవ్వతో తరచూ గొడవ పడుతుండడంతో పిల్లలను తీసుకొని ఆమె రెండునెలల క్రితం కనకల్‌లోని తల్లిగారి ఇంటికి వెళ్లిపోయింది. కూతురు రచన, కుమారుడు శివప్రసాద్ ప్రతిరోజూ కనకల్ నుంచి తాడ్వాయిలోని ప్రభుత్వ పాఠశాలకు వచ్చి చదువుతున్నారు. ఈ క్రమంలో పిల్లలను చూసేందుకు రాజలింగం గురువారం పాఠశాలకు వెళ్లగా, వారు తండ్రిని కలిసేందుకు నిరాకరించారు. భార్య కాపురానికి రాకపోవడం, పిల్లలను తనను కలిసేందుకు నిరాకరించడంతో మనస్తాపానికి గురైన లింగం గురువారం సాయంత్రం గ్రామ శివారులోని తన వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి కొమురవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్యతో గొడవ పడొద్దన్నందుకు హత్య

- అన్నను గొడ్డలితో నరికిన తమ్ముడు


గోవింద్ (ఫైల్)

రుద్రూర్: భార్యతో గొడవ పడొద్దని మందలించిన అన్నను తమ్ముడు గొడ్డలితో అతికిరాతకంగా నరికి చంపిన ఘటన కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాతంగల్‌లో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పాత పొతంగల్‌కు చెందిన దిమ్మెల గోవింద్ (58), విఠల్ అన్నాదమ్ముళ్లు. గోవింద్ మండల కేంద్రంలో క్షౌ రశాల నడుపుతూ జీవిస్తున్నాడు. విఠల్ తన భార్యతో తరచూ గొడవపడుతుండడంతో అన్న గోవింద్ మందలించేవాడు. ఈ క్రమంలో గోవింద్‌పై విఠల్ కక్షపెంచుకున్నాడు. రోజులాగే గురువారం పనిపూర్తి చేసుకొని రాత్రి ఇంటికి చేరుకున్న గోవింద్‌ను విఠల్ గొడ్డలితో నరికి హతమర్చాడు. బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ జయేశ్‌రెడ్డి, ఏఎస్సై శ్రీనివాస్‌గౌడ్ ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. మృతుడి భార్య విఠల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. తనను మందలించినందుకు గోవింద్‌ను విఠల్ హతమర్చాడా? లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

ఆర్‌ఎంపీని బెదిరించిన ఇద్దరి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ మల్లేశ్, ఎస్సై తిరుపతి

జక్రాన్‌పల్లి: మండలంలోని కొలిప్యాక్‌కు చెందిన ఆర్‌ఎంపీ పసుల గంగాధర్‌ను బెదిరించి నగదు ఎత్తుకెళ్లిన ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు డిచ్‌పల్లి సీఐ మల్లేశ్, ఎస్సై తిరుపతి తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం వెల్లడించారు. ఈనెల 3వ తేదీన వైద్యం నిమిత్తం గుర్తు తెలియని వ్యక్తులు గంగాధర్‌ను బైక్‌పై ఎక్కించుకొని గ్రామశివారులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. కత్తితో బెదిరించి రూ.5వేల నగదుతోపాటు బంగారు ఉంగరం, సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టి ఆర్మూర్ ఒడ్డెర కాలనీకి చెందిన చిన్న గంగాధర్ అలియాస్ దేవల నర్సయ్య, తొర్లికొండకు చెందిన కాటుపల్లి సతీశ్ అలియాస్ గంగారెడ్డిని నిందితులుగా గుర్తించారు. వారి వద్ద నుంచి ఉంగరం, సెల్‌ఫోన్‌తోపాటు రూ.1500 నగదు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను శుక్రవారం కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ తెలిపారు.

ముగ్గురు పేకాటరాయుళ్లు..

కామారెడ్డి క్రైమ్: మున్సిపాలిటీ పరిధిలోని అడ్లూరు గ్రామ శివారులో పేకాట స్థావరంపై దేవునిపల్లి పోలీసులు శుక్రవారం సాయంత్రం దాడి చేసి ముగ్గురిని అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారి నుంచి రూ.24,360 నగదుతోపాటు మూడు సెల్ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. పట్టుబడిన వారిని కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

నాళేశ్వర్ ఘటనలో కేసు నమోదు..

నవీపేట : మండలంలోని నాళేశ్వర్ గ్రామంలో యువతిపై మత్తుమందు చల్లి చోరీకి పాల్పడిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ శుక్రవారం తెలిపారు. గురువారం ద్విచక్ర వాహనంపై గ్రామంలోకి వచ్చిన ఇద్దరు ఫకీర్‌లు నవనీతను నమ్మించి ఇంట్లోకి వెళ్లారు. తమ వెంట తెచ్చుకున్న మత్తుమందును ఆమెపై చల్లి బీరువాలో ఉన్న రూ.40 వేల నగదును ఎత్తుకెళ్లారు. బాధితురాలు శుక్రవారం పోలీసులను ఆశ్రయించగా, కేసు నమోదు చేశారు.

బాలుడి అదృశ్యం

బోధన్‌టౌన్ (బోధన్): పట్టణంలోని రాకాసీపేట గోసంబస్తీకి చెందిన రాఘవ(6) అదృశ్యమైనట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. స్థానిక హనుమాన్ ఆలయం పరిసర ప్రాంతాల్లో కూలీ పనికి తన కొడుకు తీసుకొని రేణుక వెళ్లింది. ఆమె పని చేసుకుంటుండగా, ఆడుకుంటూ వెళ్లిన బాలుడు కనిపించలేదు. ఆందోళనకు గురైన తల్లి చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాలుడి ఆచూకీని గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు సీఐ తెలిపారు.

కల్దుర్కికి చెందిన యువతి..

బోధన్‌రూరల్(బోధన్): మండలంలోని కల్దుర్కి గ్రామానికి చెందిన డి.స్వప్న (20) అదృశ్యమైనట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): రోడ్లపక్కన ఇళ్లలో ఉండే వారు అప్రమత్తంగా ఉండాలని, అంతర్ రాష్ట్ర దొంగల ముఠాలు చోరీలకు పాల్పడుతున్నాయని ఎస్సై కోనారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి దొంగలు మాస్కులు ధరించి బైకులపై వచ్చి చోరీలు పాల్పడుతున్నారని, ఇప్పటికే కామారెడ్డి తదితర ప్రాంతాల్లో చోరీ ఘటనలు చోటు చేసుకున్నాయని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

రైతులు..

రామారెడ్డి: వ్యవసాయభూముల్లోని ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కొంతమంది ముఠాగా ఏర్పడి కాపర్ దొంగిలిస్తున్నారని, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై విజయ్ కొండ సూచించారు. వ్యవసాయభూముల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు.

వాహనాల తనిఖీ

తాడ్వాయి: మండల కేంద్రంలోని కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై పోలీసులు శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనదారులు ధ్రువీకరణపత్రాలను తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. కారు నడిపే వారు సీటు బెల్ట్, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో వాహనదారులు తమ వద్ద రూ.50 వేలకు మించి నగదు ఉంచుకోవద్దని సూచించారు.

హత్య కేసులో నిందితుల రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ సత్యనారాయణ

నిజాంసాగర్ (జుక్కల్): ఆస్తి కోసం హత్య చేసిన నిందితులను అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు బాన్సువాడ రూరల్ సీఐ సత్యనారాయణ తెలిపారు. మహమ్మద్ నగర్ మండలంలోని బూర్గుల్ గ్రామానికి చెందిన చాకలి పోశయ్య (55)ను కూతురు సుజాత, అల్లుడు శ్రీకాంత్‌తోపాటు నడిమింటి రాములు, మహబూబ్ హత్య చేసినట్లు సీఐ వెల్లడించారు. సమావేశంలో నిజాంసాగర్ ఎస్సై సుధాకర్ తదితరులున్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఆరేపల్లి గ్రామ శివారులోని గోపస్‌వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఘటనాస్థలానికి చేరుకొని ట్రాక్టర్లను సీజ్ చేశామని, వాహనాల యజమానులపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

'సర్వ సురక్ష'లో నిజామాబాద్‌కు ప్రథమ స్థానం


తపాలా సేవలపై అవగాహన కల్పిస్తున్న సీనియర్ సూపరింటెండెంట్ జనార్దన్

- దేశంలోనే ఉమ్మడి జిల్లాకు ప్రత్యేక గుర్తింపు
- మూడు నెలల్లో 23 లక్షల పాలసీలు

నిజామాబాద్ సిటీ: ఉమ్మడి నిజామాబాద్ తపాలాశాఖ దేశంలోనే అరుదైన రికార్డును సాధించింది. దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం మూడు నెలల్లోనే 23 లక్షల సర్వ సురక్ష బీమా పాలసీలు చేయించి రికార్డు సృష్టించింది. ఈ ఏడాది జనవరి 1 నుంచి మార్చి 31 వరకు మూడు నెలల కాలంలో 23 లక్షల సర్వ సురక్ష బీమా పాలసీలు చేయించి రూ.కోటీ 79 లక్షల ప్రీమియం వసూలు చేసింది. ప్రస్తుతం ఉమ్మడి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో మూడు ప్రధాన కార్యాలయాలు, 60 సబ్, 419 బ్రాంచ్ పోస్టాఫీసులు ఉన్నాయి. అధికారులు, ఉద్యోగులు తపాలా సేవలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తూ ఈ ఘనత సాధించారు.

అన్ని రకాల ఖాతాల్లోనూ ముందంజ..

గత ఆర్థిక సంవత్సరంలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో తపాలాశాఖ 1,16,846 ఖాతాలు తెరిపించి తెలంగాణ సర్కిల్‌లో రెండో స్థానంలో నిలిచింది. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు వివిధ పాలసీల్లో లక్ష్యాలను చేరుకుంది. ఇందులో మంత్లీ ఇన్‌కం స్కీం(ఎంఐఎస్) 709 పాలసీలు, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్(పీపీఎఫ్) 747, రికరింగ్ డిపాజిట్(ఆర్‌డీ) 87,891, సేవింగ్స్ బ్యాంక్(ఎస్‌బీ) 8287, టైమ్ డిపాజిట్(టీడీ) 2774, మహిళా సమ్మన్ సేవింగ్ సర్టిఫికెట్(ఎంఎస్ఎస్‌సీ), 4267, నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్(ఎన్ఎస్‌సీ) 1376, కిసాన్ వికాస్ పత్రా(కేవీపీ) 569, సుకన్య సమృద్ధి యోజన(ఎస్ఎస్‌వై) 9612, సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీం(ఎస్‌సీఎస్ఎస్) 614 పాలసీలు చేయించి లక్ష్యాన్ని చేరుకున్నారు.

పాలసీలపై ప్రజలకు అవగాహనతోనే..



తపాలాశాఖలో ప్రవేశపెట్టిన కొత్త పాలసీలు, సేవింగ్స్, ప్రమాద బీమా పథకాలపై ఉద్యోగులు, సిబ్బంది నిరంతరం ప్రజలకు అవగాహన కల్పించటంతో సర్వ సురక్ష బీమా పాలసీలో దేశంలోనే నిజామాబాద్‌కు మొదటి స్థానం దక్కింది. అలాగే ఖాతాలు తెరిపించడంలో తెలంగాణ సర్కిల్‌లో రెండో స్థానం దక్కడం ఆనందంగా ఉంది.

– జనార్దన్, సీనియర్ సూపరింటెండెంట్

ధర్మ పరిరక్షణలో భాగస్వాములు కావాలి


సమ్మేళనంలో పాల్గొన్న సాధువులు, వీహెచ్‌పీ నాయకులు

సుభాష్‌నగర్: సనాతన హిందూ ధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్క హిందువు భాగస్వామి కావాలని ప్రముఖ సాధుసంతులు పిలుపునిచ్చారు. హిందూ ధర్మాన్ని విస్తృతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం నగరంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సాధు సంతుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వీహెచ్‌పీ క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మాల సత్యం మాట్లాడుతూ.. హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలని, జాతీయతా భావాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆయా ఆశ్రమాల పీఠాధిపతులతోపాటు వీహెచ్‌పీ ప్రాంత ధర్మాచార్య సంపర్క్ ప్రముఖ్ పుప్పాల వెంకటేశ్వర్, విభాగ్ కార్యదర్శి తమ్మల కృష్ణ, విభాగ్ ధర్మచర్య నరేందర్, జిల్లా కార్యదర్శి గాజుల దయానంద్, సహ కార్యదర్శి ధాత్రిక రమేశ్, గంగాచరణ్, రవి, నిఖిల్, రామ్ చటర్జీ, ప్రేమ్, ఆర్మూర్, నందిపేట్ ప్రఖండ స్థాయి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆస్తి కోసం కొడుకుల గొడవ.. మనస్తాపంతో తల్లి ఆత్మహత్య

నవీపేట: మండలంలోని నాగేపూర్ గ్రామానికి చెందిన కొండ్ర గంగామణి(54) చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పొలం పంపిణీ విషయంలో గంగామణి ఇద్దరు కొడుకులు ప్రవీణ్, శ్రీనివాస్ గత కొంత కాలంగా గొడవపడుతున్నారు. ఇరువురిని తల్లి పలుమార్లు శాంతింపజేసినప్పటికీ మళ్లీ గొడవలు జరుగుతుండడంతో మనస్తాపానికి గురైన గంగామణి గురువారం రాత్రి గ్రామ శివారులోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుటుంబసభ్యులతో గొడవల కారణంగా..

డిచ్‌పల్లి: మండలంలోని బర్ధిపూర్ గ్రామానికి చెందిన షేక్ మతీన్ (38) గురువారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మతీన్‌ను అతడి భార్య రెండు సంవత్సరాల క్రితం వదిలి వెళ్లిపోయింది. మద్యానికి బానిసైన మతీన్‌కు కుటుంబ సభ్యులతో ప్రతిరోజూ గొడవలు అవుతుండడంతో జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక సమస్యలతో ఆర్మీ మాజీ జవాన్..


బొండ్ల భరత్ (ఫైల్)

జక్రాన్‌పల్లి: ఆర్మీలో పనిచేసిన మండలంలోని పడకల్‌కు చెందిన బొండ్ల భరత్ (30) ఆర్థిక సమస్యల కారణంగా ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మీలో పనిచేసిన భరత్ గత మూడేళ్లుగా విధులకు హాజరుకాకపోవడంతో తన ఉద్యోగాన్ని కోల్పోయాడు. ఈ క్రమంలో అప్పులు, ఆర్థిక సమస్యలు ఎక్కువకావడంతో మనస్తాపానికి గురై గురువారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. భరత్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి?


దేవియానాయక్

బాన్సువాడ రూరల్: మండలంలోని మొగులాన్‌పల్లి తండాకు చెందిన దేవియానాయక్(50) శుక్రవారం వడదెబ్బ కారణంగా మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గురువారం ఉదయం ఉపాధి పనులకు వెళ్లిన దేవియానాయక్ అర్ధరాత్రి అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారన్నారు. అక్కడి వైద్యులు చికిత్స అనంతరం నిజామాబాద్‌కు రిఫర్ చేశారని తెలిపారు. నిజామాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో పరిస్థితి విషమించి దేవియానాయక్ మృతి చెందాడన్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

బైక్ పైనుంచి పడి యువకుడు..


గొల్ల నవీన్ (ఫైల్)

డిచ్‌పల్లి: బైక్ అదుపు తప్పిన ఘటనలో మండలకేంద్రానికి చెందిన గొల్ల నవీన్ (32) బైక్ అదుపుతప్పి మృతి చెందాడని ఎస్సై మహేశ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సాంపల్లి తండాకు చెందిన రాథోడ్ శ్రీకాంత్, నవీన్ ఇద్దరు కలిసి గురువారం రాత్రి బైక్‌పై ఘన్‌పూర్ గ్రామ చెరువుకట్ట పైనుంచి దూస్‌గాం వైపు వెళ్తుండగా బైక్ అదుపుతప్పింది. ఈ ఘటనలో నవీన్ తల, నడుముకు బలమైన గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి నవీన్ మృతి చెందాడు. మృతుడి తండ్రి గొల్ల కిష్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అయితే, నవీన్ మృతిపై గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఇంట్లోకి ప్రవేశించి బంగారం, వెండి చోరీ

వేల్పూర్: మండలంలోని లక్కోరలో భారతి అనే మహిళ ఇంట్లోకి ప్రవేశించిన గుర్తు తెలియని ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలు బంగారం, వెండి ఎత్తుకెళ్లారని ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. భారతి ఒంటరిగా ఉన్న సమయంలో నలుగురు ఇంట్లోకి ప్రవేశించారు. తలుపులు మూసివేసి భారతిని బెదిరించి మెడలోని పుస్తెలతాడుతోపాటు పర్సులోని మరో రెండు తులాల బంగారం, ఐదు తులాల వెండిని ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే డయల్ 100కు సమాచారం అందించాలని ఎస్సై సూచించారు.

విఠలేశ్వర మందిరంలో..

బాన్సువాడ : పట్టణంలోని శాంతినగర్ విఠలేశ్వర మందిరంలో గురువారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. హుండీని పగులగొట్టి రూ.10వేల నగదును ఎత్తుకెళ్లారు. శుక్రవారం ఉదయం ఆలయానికి వచ్చిన కమిటీ సభ్యుడు మంగళి హన్మాండ్లు చోరీ జరిగినట్లు నిర్ధారించుకొని పోలీసులకు సమాచారం అందించగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మూడు రోజుల వ్యవధిలోనే రెండు ఆలయాల్లో చోరీ జరగడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఐదు సెల్‌ఫోన్‌లు..

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్ హనుమాన్ ఆలయంలో గురువారం అర్ధరాత్రి హనుమాన్ మాలధారుల సెల్‌ఫోన్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. మాలధారులు గణేశ్, నవీన్, రాజన్న, విక్కీ, నాగార్జున ఆలయంలో నిద్రిస్తుండగా, వారి సెల్‌ఫోన్లు చోరీ అయ్యాయి. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



కామారెడ్డి టౌన్ : ప్రతీ ఒక్కరికి ఆధ్యాత్మిక జీవనం అవసరమని కామారెడ్డి జనరల్ ఆస్పత్రి సూపరిటెండెంట్ డాక్టర్ రాంసింగ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని యోగా భవన్‌లో నిర్వహించిన 'ఆధ్యాత్మిక జీవనం' అనే అంశంపై కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై యోగా సభ్యులనుద్దేశించి మాట్లాడారు. హిందూధర్మాన్ని ప్రతిఒక్కరూ కాపాడాలన్నారు. కామారెడ్డి జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాం రెడ్డి, యోగా గురువులు అంజయ్య, బాస రఘుకుమార్, అనిల్ రెడ్డి, రమేష్, సిద్దాగౌడ్, సురేందర్, యోగా సభ్యులు పాల్గొన్నారు.

నకిలీ విత్తన విక్రయదారులపై చర్యలు తీసుకోండి



బాన్సువాడ : బీర్కూర్ మండల కేంద్రంలోని గ్రోమోర్ దుకాణ యాజమాన్యం నకిలీ విత్తనాలు విక్రయించారని వారిపై చర్యలు తీసుకోవాలని బీర్కూర్‌కు చెందిన పలువురు రైతులు శనివారం తహసీల్దార్ కార్యాలయం అధికారికి వినతి పత్రం అందజేశారు. బీర్కూర్ గ్రామానికి చెందిన రైతులు యాసంగిలో పంటలు సాగు చేసుకునేందుకు స్థానిక గ్రోమోర్ కేంద్రంలో విత్తనాలు కొనుగోలు చేశామని, ప్రస్తుతం పంట చేతికొచ్చే దశలో పొల్లు పోవడంతో పాటు తెగుళ్లు వచ్చి పంట పూర్తిగా నాశనం అవుతుందన్నారు. కేవలం గ్రోమోర్ కేంద్రంలో విత్తనాలు కొనుగోలు చేసిన రైతుల పంటలు మాత్రమే నష్టం వాటిల్లిందని రైతులు వివరించారు. ఎకరానికి రూ.35 వేల పెట్టుబడి పెట్టిన ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. కావున గ్రోమోర్ కేంద్రం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

వరిలో పాముపొడ తెగులు

నిజాంసాగర్(జుక్కల్): కోతకు వచ్చిన వరి పంటను పాము పొడ తెగులు విపరీతంగా ఆశిస్తుందని, పంట పొలాలను రైతులు జాగ్రత్తగా పరిశీలించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి అమర్ ప్రసాద్ సూచించారు. శనివారం మహమ్మద్ నగర్ మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన పరిశీలించారు. పాముపొడ తెగులు ఉండటంతో ప్రాపికొనజోల్ 200 మి.మీ మందును ఎకరానికి లేదా హెక్సాకొనజోల్ 400 మి.మీ మందును ఎకరం పంటపొలానికి పిచికారి చేయాలన్నారు. అగ్గితెగులు నివారణకు గాను ట్రై సైక్లోజోన్ మరియు మాంకిజోల్ 300 గ్రాముల మందును ఎకరానికి పిచికారి చేయాలని ఆయన తెలిపారు.కంకి నల్లి తెగులుకు స్పైరోమెసిఫెన్ 100 మిల్లీ లీటర్ల మందును, ప్రొఫెనోపాస్ లేదా ప్రాపర్‌గైట్ మందును పిచికారి చేయాలని చెప్పారు.

'మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి'

కామారెడ్డి క్రైం: ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో మత్స్యకారులు మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా మత్స్యశాఖాధికారి వరదారెడ్డి శనివారం ఒక ప్రకటనలో సూచించారు. చెరువులు, కుంటలలో ఉండే నీటిలో వేడి పెరిగి చేపలు మృత్యువాత పడే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. మత్స్యకారులు వీలైనంత త్వరగా చేపలు పట్టి విక్రయించుకోవాలని సూచించారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు సెట్విన్

- అతి తక్కువ ఫీజుతో కంప్యూటర్, టైలరింగ్ కోర్సులు
- నిరుద్యోగ యువతకు చక్కని అవకాశం



సెట్విన్ సంస్థలో కంప్యూటర్ కోర్సు నేర్చుకుంటున్న యువతులు (ఫైల్)

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): రాష్ట్ర ప్రభుత్వం యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో 'సెట్విన్' సంస్థ నిరుద్యోగ యువతీయువకులకు ఉపాధి శిక్షణనిస్తోంది. నిజామాబాద్ జిల్లాలో ఏకైక సెట్విన్ శిక్షణ సంస్థ డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్ గ్రామ పంచాయతీ భవనంపై కొనసాగుతోంది. 2014లో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ ఎస్సెస్సీ, ఇంటర్ ఉత్తీర్ణులైన వారికి అతితక్కువ ఫీజుతో కంప్యూటర్ శిక్షణ (ఎంఎస్–ఆఫీస్/డీటీపీ/ ఫొటో షాప్/ పేజ్‌మేకర్/టాలీ కోర్సులు)తోపాటు, కుట్టు (టైలరింగ్) శిక్షణ ఇస్తున్నారు. ఈ కోర్సులను మార్కెట్‌లోని ప్రైవేట్ శిక్షణ కేంద్రాల్లో నేర్చుకోవాలంటే దాదాపు రూ.4 వేల వరకు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. సెట్విన్‌లో మాత్రం కేవలం కంప్యూటర్ శిక్షణకు రూ.750, టైలరింగ్‌కు రూ.వెయ్యి ఫీజును వసూలు చేస్తూ యువతకు శిక్షణ ఇస్తున్నారు. మూడు నెలల అనంతరం శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ప్రభుత్వం ప్రత్యేకమైన సర్టిఫికెట్ అందిస్తుంది. సెట్విన్‌లో అందుకున్న సర్టిఫికెట్‌తో ప్రభుత్వ, ప్రైవేట్‌రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చు. డిచ్‌పల్లిలోని శిక్షణ కేంద్రంలో ఇప్పటి వరకు రెండువేల మందికి పైగా యువత, మహిళలు వివిధ రకాల శిక్షణ పొందినట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు.

మహిళల కోసం..

యువతులు,మహిళల కోసం కుట్టు (టైలరింగ్) శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పూర్తి చేసుకుని సర్టిఫికెట్ పొందిన వారు సొంతంగా వ్యాపారాన్ని ప్రారంభించవచ్చు. బ్యాంకుల ద్వారా రుణ సదుపాయాన్ని కల్పిస్తారు.

ప్రతిరోజూ దరఖాస్తుల స్వీకరణ

డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌లోని సెట్విన్ శిక్షణ కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న గ్రామ పంచాయతీ భవనంపై కొనసాగుతోంది. ప్రతిరోజూ దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు శిక్షణ సంస్థ జిల్లా సమన్వయకర్త అబ్రార్‌ఖాన్, ట్రైనర్లు సందీప్ (కంప్యూటర్), గౌతమి (కుట్టు శిక్షణ) తెలిపారు. ముఖ్యంగా యువతీ యువకులు చదువుకుంటూనే ప్రతిరోజూ రెండు గంటలపాటు శిక్షణ పొందే విధంగా వారికి అనుకూలమైన సమయాల్లో శిక్షణ ఇస్తారు. సెట్విన్‌లో శిక్షణ వివరాలు, పూర్తి సమాచారం కోసం 89858 64424, 97000 07149 నంబర్లను సంప్రదించవచ్చని సమన్వయ కర్త అబ్రార్‌ఖాన్ సూచించారు. ప్రస్తుతం విద్యార్థులకు వేసవి సెలవులు ఉన్నందున సెట్విన్ సంస్థ ద్వారా అందించే కంప్యూ టర్, టైలరింగ్ శిక్షణను ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కార్యకర్తలు పోటీతత్వంతో పనిచేయాలి



కార్పొరేటర్లు, నాయకులతో కలిసి టిఫిన్ చేస్తున్న ఎంపీ అర్వింద్

ఎంపీ అర్వింద్ ధర్మపురి

సుభాష్‌నగర్ : బీజేపీ గెలుపు కోసం కార్యకర్తలు పోటీతత్వంలో పని చేయాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం వినాయక్‌నగర్‌లోగల హనుమాన్ ఆలయం వద్ద పార్టీ జెండా ఎగురవేశారు. అనంతరం పాటిగల్లి మున్నూరుకాపు సంఘంలో 23, 36,42 డివిజన్ల టిఫిన్ బైఠక్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఎంపీ మాట్లాడుతూ.. ప్రజలు బీజేపీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. ప్రధాని మోదీ 10 ఏళ్ల పాలనలో అన్నివర్గాల వారిని అభివృద్ధి చేశారన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ప్రతి బూత్‌లో మెజారిటీ వచ్చేలా కార్యకర్తలు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. కాగా టిఫిన్ బైఠక్‌లో కార్యకర్తలు బయటి నుంచి టిఫిన్లు తెప్పించుకొని తిన్నారు. ఎవరి టిఫిన్లు వారు తెచ్చుకోకపోవడంతో ఎంపీ సహా కార్యకర్తలందరూ అదే టిఫిన్ చేశారు. ఆకుల హేమలత శ్రీనివాస్, పంచరెడ్డి లావణ్య లింగం, మల్లేష్ యాదవ్, లక్కం భూమేష్, పడాల భూపతి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విద్యుత్ షాక్‌తో రైతు మృతి



కమ్మర్‌పల్లి: పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన రైతు విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన సంఘటన కమ్మర్‌పల్లి మండలం బషీరాబాద్‌లో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తీరెడి భూమేశ్వర్(55) శనివారం ఉదయం పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. పంప్‌సెట్ స్విచ్ ఆన్‌చేసే క్రమంలో తెగికిందపడిన విద్యుత్ వైరు కాలికి తగలడంతో షాక్‌తో మృతి చెందాడు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బోధన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని పంచవటి సూపర్ మార్కెట్ ఎదుట గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని పట్టణ సీఐ వీరయ్య శనివారం తెలిపారు. మృతుడి వయస్సు 30 నుంచి 35 సంవత్సరాలు ఉంటుందని, వడదెబ్బ కారణంగా మృతి చెంది ఉంటాడని భావిస్తున్నామని సీఐ అన్నారు.మృతుడి ఆచూకీ తెలిసిన వారు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించామన్నారు.

పేకాటస్థావరంపై దాడి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని చిట్యాలలో పేకాట స్థావరంపై దాడిచేసి రూ.49,810 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. గ్రామ శివారులో వ్యవసాయభూమిలోని చెట్టుకింద పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేయగా, ఆరుగురు పట్టుబడ్డారన్నారు. రెండు కార్లు, మూడు బైక్‌లు, ఆరు మొబైల్ ఫోన్లతోపాటు నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. పేకాటాడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బండార్‌పల్లిలో..

బోధన్‌రూరల్(బోధన్): మండలంలోని బండార్‌పల్లి శివారులో పేకాటస్థావరంపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్సై నాగనాథ్ శనివారం తెలిపారు. రూ.3,500 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

దోమకొండ: మండలకేంద్రంలో అక్రమంగా నిల్వ ఉంచిన 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయీస్ అధికారులు శనివారం సీజ్ చేశారు. రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి వాసవి రైస్‌మిల్లులో నిల్వ ఉంచారనే సమాచారం మేరకు అధికారులు దాడి చేశారు. బియ్యాన్ని సీజ్ చేసి రైస్‌మిల్ నిర్వాహకుడు కస్ప ప్రశాంత్‌పై కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లయీస్ అధికారి కిష్టయ్య తెలిపారు. గతంలోనూ ఇదే రైస్‌మిల్‌లో పీడీఎస్ బియ్యం పట్టుబడిందని, బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రుద్రూర్ : మండలంలోని రాయకూర్ శివారులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో మృతి చెందిన యువకుడిని పోలీసులు మహారాష్ట్రకు చెందిన వ్యక్తిగా భావిస్తున్నారు. మృతదేహాన్ని బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పరిస్థితి విషమించి మరో యువకుడు..

బాన్సువాడ రూరల్: మండలంలోని తిర్మలాపూర్ శివారులో బాన్సువాడ–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి వ్యాన్ అదుపుతప్పి పల్టీకొట్టిన ఘటనలో గాయపడిన అంగోత్ రాహుల్(19) శనివారం మృతి చెందాడు. సీఐ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంసాగర్ మండలం తెల్గాపూర్‌లో ఓ ఫంక్షన్‌లో డీజేపెట్టి అర్ధరాత్రి స్వగ్రామమైన ఇబ్రహీంపేట్ తండాకు తిరిగి వస్తుండగా వాహనం బోల్తాపడింది. ఈ ఘటనలో గాయాలపాలైన రాహుల్ పరిస్థితి విషమించి మృతి చెందాడు. అంగోత్ అరుణ్ అనే వ్యక్తి వాహనాన్ని అజాగ్రత్తగా నడపడం కారణంగానే తన కొడుకు మృతి చెందాడని మృతుడి తండ్రి అంబర్‌సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఒకరికి తీవ్రగాయాలు..

ఎల్లారెడ్డి: బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం నిజాంసాగర్ నుంచి కామారెడ్డికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు, కామారెడ్డి వైపు నుంచి నిజాంసాగర్ వైపు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టింది. పెద్ది గంగాధర్ అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం నిజామాబాద్‌కు తరలించారు.

కుటుంబ కలహాలతో మహిళ ఆత్మహత్య

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): కుటుంబ కలహాల కారణంగా మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన నాగిరెడ్డిపేట మండలంలోని బంజారాతండాలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాతండాకు చెందిన వినోద్‌కు పిట్లం మండలంలోని జగదాంబతండాకు చెందిన అరుణ అలియాస్ కావ్యతో వివాహమైంది. గతకొద్ది రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు అవుతుండడంతో మనస్తాపానికి గురైన అరుణ(36) ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్య తల్లిగారింటికి వెళ్లిపోవడంతో..

నిజాంసాగర్(జుక్కల్): భార్య తల్లిగారి ఇంటికి వెళ్లిపోవడంతో మనస్తాపానికి గురై భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఆరేడ్‌లో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన మన్నె రమేశ్, లక్ష్మి దంపతులు కుమారుడు, కూతురితో కలిసి హైదరాబాద్‌లో ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. 15రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చారు. కుటుంబంలో చిన్నపాటి వాగ్వాదం చోటుచేసుకోవడంతో లక్ష్మి ఐదురోజుల క్రితం తల్లిగారి ఇంటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన రమేశ్(30) ఇంట్లో ఎవరూలేని సమయంలో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై సుధాకర్ తెలిపారు.

వివాహితకు వేధింపులు

బోధన్‌రూరల్(బోధన్): మండలంలోని కల్దుర్కిలో ఓ వివాహితను యువకుడు వేధించగా కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు యువకుడిపై కేసు నమోదు చేశామన్నారు.

కిడ్నాప్ కలకలం

బాన్సువాడ రూరల్: భిక్షాటన చేస్తూ జీవి స్తున్న మహిళతోపాటు ఆమె కొడుకును కిడ్నా ప్ చేసేందుకు యత్నించిన వ్యక్తులను స్థానికులు పోలీసులకు అప్పగించారు. వివ రాలు ఇలా ఉన్నాయి.. ఇద్దరు వ్యక్తులు మండల కేంద్రంలోని రాజారాం దుబ్బకు చెందిన మహిళకు మద్యం తాగించి, ఆమె కొడుకుకి బిస్కెట్లు ఇప్పించి తమవెంట తీసుకెళ్తుండగా.. స్థానికులు అనుమానంతో ప్రశ్నించారు. సదరు వ్యక్తులు పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో వారికి దేహశుద్ధి చేసి పో లీసులకు అప్పగించారు. అనుమానితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

నలుగురిపై పోక్సో కేసు

ఖలీల్‌వాడి: నగరంలోని ఐదో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీతారాంనగర్ కాలనీలో వ్యభిచారం గృహంపై పోలీసులు రెండురోజుల క్రితం దాడి చేశారు. వ్యభిచార గృహం నిర్వాహకుడితోపాటు ఇద్దరు మహిళలు, ముగ్గురు విటులను అరెస్ట్ చేశారు. అయితే, బాలికతో వ్యభిచారం చేయించిన నిర్వాహకుడితోపాటు ముగ్గురు విటులపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం ఆలస్యంగా తెలిసింది. ఈ విషయమై ఎస్సై అశోక్‌ను వివరణ కోరగా.. నలుగురిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రైతుకిచ్చిన హామీలు నెరవేర్చాలి



బాన్సువాడలో నిర్వహించిన నిరసన దీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

- మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి కాంగ్రెస్
- నిరసన దీక్షల్లో ఎమ్మెల్యే పోచారం, మాజీ ఎమ్మెల్యేలు సింధే, జాజాల

బాన్సువాడ : మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బాన్సువాడలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం నిరసన దీక్ష నిర్వహించారు. ఈ దీక్షకు హాజరైన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పుడు దాని ఊసెత్తడం లేదన్నారు. కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకం ద్వారా రూ. లక్ష ఆర్థిక సాయంతో పాటు తులం బంగారం ఇస్తామని మోసం చేశారని, కౌలు రైతుకు ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని ఇప్పటివరకు ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ ఇప్పుడేందుకు ఇవ్వడం లేదని అన్నారు. కొందరు స్వార్థరాజకీయాలతో బీఆర్ఎస్‌ను వీడారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బద్యానాయక్, జంగం గంగాధర్, అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, ఎజాస్, గురువినయ్, ఎజాస్‌ఖాన్, మోహన్‌రెడ్డి తదితరులున్నారు.

నాగమడుగు ఎత్తిపోతలు ఆపితే ఉద్యమం

నిజాంసాగర్(జుక్కల్): 40 వేల ఎకరాలకు సాగునీరందించే నాగమడుగు ఎత్తిపోతల పథకాన్ని కాంగ్రెస్ పభుత్వం పూర్తి చేయకుంటే రైతుల పక్షాన ఉద్యమం చేస్తామని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. పిట్లం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతు నిరసన దీక్ష చేపట్టారు. జుక్కల్ నియోజకవర్గ స్థాయి రైతు దీక్షకు హాజరైన మాజీ ఎమ్మెల్యే రైతులు, బీఆర్ఎస్ నాయకులను ఉద్దేశించి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రైతు హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ జెడ్పీచైర్మన్ దఫేదార్ రాజు నాయకులు దుర్గారెడ్డి, గంగారెడ్డి తదితరులున్నారు.

క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇవ్వాలి..

ఎల్లారెడ్డి : వరి పంటకు క్వింటాలుకు మద్దతు ధర రూ. 500 ప్రకటించాలని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. శనివారం ఎల్లారెడ్డి పట్టణంలోని తెలంగాణ తల్లి ప్రాంగణంలో రైతుకు మద్దతు దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మోస పూరిత వాగ్దానాలు చేసి మోసం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని చెప్పి నాలుగు నెలలు గడుస్తున్న ఇంత వరకు అమలు చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ నర్సింలు, మండల బీఆర్ఎస్ అధ్యక్షులు జలందర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ కపిల్‌రెడ్డి తదితరులున్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

హన్మంత్ రెడ్డిపై వేటు

- స్పెషల్ ఆఫీసర్ బాధ్యతల తొలగింపు
- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్
- శాఖాపరమైన విచారణ చేపట్టాలని వెటర్నరీ శాఖ జేడీకి ఆదేశాలు

సాక్షి ఎఫెక్ట్..

డొంకేశ్వర్(ఆర్మూర్) : గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తూ పట్టుబడిన మండల పశువైద్య అధికారి హన్మంత్‌రెడ్డిపై వేటు పడింది. డొంకేశ్వర్ మండలం దత్తాపూర్, మారంపల్లి గ్రామ పంచాయతీలకు ఆయనను స్పెషల్ ఆఫీసర్ బాధ్యతల నుంచి తప్పించారు. ఈ మేరకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ వ్యవహారం నుంచి బయట పడేందుకు హన్మంత్‌రెడ్డి ఎన్ని ఎ త్తుగడలు వేసినా ఫలించలేదు. రాజకీయ నాయకులు రంగంలోకి దిగినా ఆయనను కాపాడలేకపోయారు. మారంపల్లి, దత్తాపూర్ గ్రామ పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్‌గా నియామకమైన పశువైద్య అధికారి గత నెలలో దత్తాపూర్ జీపీ ట్రాక్టర్‌ను కార్యదర్శికి సమాచారం లేకుండా తీసుకెళ్లారు. నిబంధనలకు విరుద్ధంగా ట్రాక్టర్‌లో ఇసుకను నింపుకొని నిజామాబాద్‌కు తరలిస్తుండగా దొరికిపోయారు. పంచా యతీ కార్యదర్శి సుప్రియ వెంటనే ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఈ నెల 2న సాక్షి దినపత్రికలో 'అధికారీ ఇదేం పని' కథనాన్ని సాక్ష్యాలతో సహా ప్రచురించింది. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్మూర్ డీఎల్‌పీవో శివకృష్ణ జీపీ కార్యాలయానికి వచ్చి విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. ట్రాక్టర్ డ్రైవర్, కారోబార్, పంచాయతీ కార్యదర్శిని బెదిరించి తప్పుడు సాక్ష్యాలు చెప్పించే ప్రయత్నం చేసినా వారు వాస్తవాలను వెల్లడించారు. స్పెషల్ ఆఫీసరే బలవంతంగా ట్రాక్టర్‌ను తీసుకెళ్లాడని, పైగా తప్పు డు రసీదు కూడా జీపీ నుంచి తీసుకున్నట్లు విచార ణ అధికారికి వివరించారు. విచారణ నివేదికను డీ ఎల్‌పీవో శనివారం జిల్లా పంచాయతీ అధికారికి అందజేశారు. రిపోర్టు ఆధారంగా కలెక్టర్‌కు ఫైల్ పెట్టగా ఆయన ప్రత్యేకాధికారి బాధ్యతల నుంచి హన్మంత్‌రెడ్డిని తప్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఫిట్స్‌తో ఇటుకబట్టి కూలీ మృతి

మాచారెడ్డి: ఫిట్స్‌తో ఇటుక బట్టి కూలీ మృతి చెందిన సంఘటన శనివారం మాచారెడ్డిలో చోటుచేసుకొంది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన ప్రకారం మహారాష్ట్రలోని యావత్‌మాల్ జిల్లాకు చెందిన అడవ్ గజానన్(32) రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని ఇటుక బట్టీలో పని చేస్తున్నాడు. శనివారం ఉదయం గంభీరావుపేట నుంచి మహారాష్ట్రకు బయల్దేరి కాకుల గుట్ట తండా స్కూల్ వెనకాల ఫిట్స్ వచ్చి పడిపోయి మరణించాడు. అటుగా వెళ్తున్న స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కుల బహిష్కరణ ఘటనలో కేసు నమోదు

భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డికి చెందిన లలితను కులం నుంచి బహిష్కరించారని, బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సీ కులపెద్దలపై కేసు నమోదు చే సినట్లు ఎస్సై సాయికుమార్ శనివారం తెలిపారు. బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్న వివరాలు ఇలా ఉన్నాయి.. లలిత భర్త నర్సింలు ఇటీవల మృతి చెందాడు. ఆయన బతికి ఉన్నప్పుడు ఓ పెళ్లి విషయంలో నర్సింలుకు కులస్తులతో గొడవ జరిగింది. నర్సింలుపై ద్వేషం పెంచుకున్న పెద్దలు కులం నుంచి బహిష్కరించారు. ఆ తరువాత నర్సింలు గతనెల 24వ తేదీన మృతి చెందగా, ఆయన అంత్యక్రియలకు కులస్తులు హాజరు కాకపోగా, వచ్చిన వారిని బెదిరించారు. ఈ నేపథ్యంలో తనకు ప్రాణభయం ఉందని లలిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రెండు గ్రామాల్లోని ఆరు ఇళ్లలో చోరీ

- నగదు, ఆభరణాల అపహరణ

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పర్మళ్ల, శెట్పల్లి గ్రామాల్లో శుక్రవారం రాత్రి దుండగులు ఆరు ఇళ్లలో చోరీకి పాల్పడినట్లు ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. పర్మళ్లకు చెందిన అన్నాదమ్ముళ్లు ఈర్ల రాజు, ఈర్ల గణేశ్ ఇళ్లతోపాటు రాజిరెడ్డిగారి అంజిరెడ్డి, వెంకట్‌రెడ్డి, శెట్పల్లికి చెందిన కంత్రపల్లి సాయన్న, గంగారాం ఇళ్ల నుంచి నగదు, ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఈర్ల గణేశ్, ఈర్ల రాజు ఒకే ఇంట్లో వేర్వేరు పోర్షన్లలో ఉంటున్నారు. రాత్రి వేళ ఇంటికి తాళం వేసి దాబాపై పడుకోగా, దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బంగారు, వెండి ఆభరణాలతోపాటు రూ.30వేల నగదు ఎత్తుకెళ్లారు. అలాగే వెంకట్‌రెడ్డి ఇంట్లో నుంచి రూ.15వేల నగదు, అంజిరెడ్డి ఇంట్లో నుంచి వెండి గొలుసులు ఎత్తుకెళ్లారు. శెట్పల్లి గ్రామానికి చెందిన కంత్రపల్లి గంగారం ఇంట్లో 10 తులాల వెండి పట్టగొలుసులు చోరీకి గురయ్యాయి. బాధితులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎల్లారెడ్డి సీఐ రవీందర్, ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి ఆయా గ్రామాలకు చేరుకొని క్లూస్ టీంను రప్పించి విచారణ చేపట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలిక అదృశ్యం

బోధన్‌రూరల్(బోధన్): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైనట్లు రూరల్ ఎస్సై నాగనాథ్ శనివారం తెలిపారు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గాంధారికి చెందిన వ్యక్తి..



భూస సాయిలు

కామారెడ్డి క్రైం: గాంధారికి చెందిన బూస సాయిలు కామారెడ్డిలో అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి శనివారం తెలిపారు. సాయిలుకు మతిస్థిమితం లేకపోవడంతో హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు అతని తమ్ముడు భూపతి ఈ నెల 5న సాయంత్రం కామారెడ్డికి తీసుకువచ్చాడు. కొత్త బస్టాండ్ ప్రాంతంలో బస్సు దిగిన తర్వాత గుట్కా తెచ్చుకుంటానని చెప్పి బస్టాండ్ బయటకు వెళ్లిన సాయిలు తిరిగి రాలేదు. సాయిలు ఆచూకీ లభించకపోవడంతో భూపతి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.